క్లుప్తంగా

సభను విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఉట్నూర్‌లో శనివారం నిర్వహించే మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సుఫీయన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు, అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు జాదవ్ లఖన్, కనక హన్మంత్ రావు, పోటీ సాయినాథ్, ఆత్రం మారుతి పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ హయాంలో పేదలకు అన్యాయం'


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ హయాంలో అన్నివర్గాలకు అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్‌బాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, తిడికే ఇందుబాయి, రాథోడ్ భీంరావ్, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, గిరిధర్, సోయం వినోద్ పాల్గొన్నారు.

క్షయ నివారణకు ప్రత్యేక కృషి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: ప్రభుత్వం క్షయ నివారణకు ప్రత్యేక కృషి చేస్తోందని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌నగర్‌లో 42 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వైద్య పరీక్షలు చేశారు. వ్యాధి సోకినవారు వెంటనే సంబంధిత ఆరోగ్య కేంద్రంలో సమాచారం ఇవ్వాలన్నారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ రాజుబాయి, హెల్త్ సూపర్ వైజర్లు కళావతి, ఉత్తంసింగ్, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం

సిరికొండ: బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపు కోసం మండలంలో నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం మండలం లోని నేరడిగొండ(జి), నారాయణ పూర్, సోన్‌పెల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ గెలుపు కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎక్బాల్, గోర్ల రాజన్న, సూర్యవంశీ, మారుతి, గణపతి, జగన్, సర్పంచ్ కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

ఓటమి ఒప్పుకున్న సీఎం కేసీఆర్


మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ఎన్నికలకు ముందే సీఎం కేసీఆర్ ఓటమిని ఒప్పుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మలుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన బహిరంగ సభల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలైతే ఎటువంటి నష్టం లేదని సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు చేయడమే ఇందుకు నిదర్శమన్నారు. బీఆర్‌ఎస్ పాలన కేవలం 33 రోజులు మాత్రమే ఉండనుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కుంటాల రాములు, నళినిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

బోథ్: మండలంలోని సొనాల గ్రామం ఎస్సీ కాలనీలో బతుకమ్మ సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఆడిపాడారు. వెళ్లిరా బతుకమ్మ అంటూ.. సమీపంలోని వాగుల్లో నిమజ్జనం చేశారు.

అమృత కలశం గవర్నర్‌కు అందజేత

బోథ్: మేరీ మట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సేకరించిన మట్టి కలశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసైకి మండలంలోని కౌట గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ అందజేశారు. కాగా.. గ్రామం నుంచి సోమేశ్వర్‌తో పాటు రమేశ్, నరేశ్, ప్రణయ్, నగేశ్, ప్రశాంత్‌లను ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి ఎంపిక చేశారు.

దివ్యాంగుల వికాసం ఏది?

- పూర్తిస్థాయిలో అందని సేవలు
- నిరుపయోగంగా పరికరాలు, సామగ్రి
- పట్టించుకోని అధికారులు


ఫిజియోథెరపీ చేస్తున్న సిబ్బంది(ఫైల్)


తాళం వేసి ఉన్న తలమడుగులోని వికాస కేంద్రం

తలమడుగు: దివ్యాంగులకు అవసరమైన చికిత్సలు నిర్వహించి వారిలోని వైకల్యాన్ని పారద్రోలేందుకు ప్రభుత్వం వికాస సేవ దివ్యాంగుల కేంద్రాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం సాయంతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ దివ్యాంగులకు మాత్రం ఎలాంటి సేవల అందడం లేదు. తలమడుగు మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో దివ్యాంగుల వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దివ్యాంగుల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతారు. ప్రత్యేక చికిత్స చేసి వారి వైకల్యాన్ని పోగొట్టేందుకు కృషి చేస్తారు. మండలంలోని మొత్తం 78 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో మండలంలో 31 మందిని మాత్రమే గుర్తించారు. తాంసి మండలంలో 30 మంది ఉండగా.. 11 మందిని గుర్తించారు. భీంపూర్ మండలంలో 60 మంది ఉండగా 11 మందిని గుర్తించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వీరికి స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, ప్రత్యేక విద్య అందించేందుకు ఇద్దరు సిబ్బందిని నియమించారు. ఒక్కరికీ రూ. 19,500 ఇస్తున్నారు. దివ్యాంగుల మానసికోల్లాసం కోసం ఆటపరికరాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. అయితే కొన్ని కేంద్రాలలో పరికరాలు విరిగిపోయాయి. తిరిగి కొత్త పరికరాలు అందించలేదు.

కాగితాల్లోనే సేవలు..

గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం పనిచేసే సెర్ప్ సంస్థ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ), జాతీయ అక్షరాస్యత మిషన్, ఎన్ఆర్ఎల్ఎం ప్రత్యేక నిధులతో వికాస కేంద్రం మంజూరైంది. ప్రతిరోజు వికాస కేంద్రం ద్వారా విద్య, వికాస క్రీడలు, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. వివిధ గ్రామాల్లోని దివ్యాంగులను ప్రతిరోజు మండల కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. గతంలో దివ్యాంగులను ఆటోలో తీసుకవచ్చి ఫిజియోథెరపీ, క్రీడలు, ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ప్రస్తుతం ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో దివ్యాంగులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో వారికి ఎలాంటి సేవలు అందడం లేదు. కేవలం కాగితాల్లోనే దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ, చికిత్స ఇస్తున్నాట్లు చూపెడుతున్నారు. శిక్షణ కోసం మంజూరయ్యే నిధులు పక్కదారి పడుతున్నట్లు పలు విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలా రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన సామగ్రి నిరుపయోగంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు మండలాలకు ఒక్కరిని నియమించడంతో ఫిజియోథెరపీ సేవలు అందడం లేదు. వికాస కేంద్రాన్ని తనిఖీ చేసి పర్యవేక్షించే నాథుడే కరువయ్యారని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వికాస కేంద్రాన్ని పర్యవేక్షించి దివ్యాంగులకు సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు.

'బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు'


మాట్లాడుతున్న కొక్కిరాల విశ్వప్రసాద్

నార్నూర్: బీఆర్‌ఎస్ మాయదారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని కుమురం భీం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో అజ్మీరా శ్యాం నాయక్‌తో కలిసి కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్కరికైనా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దండుకున్నారే తప్పా అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. కనీసం పోటీ పరీక్షలు నిర్వహించలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. అధిష్టానం ఎవరికి బీఫాం ఇచ్చినా.. వారి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు వసంత్‌రావు, జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గుండా శ్యామ్, గెడం పరుశురాం, మారుతి, ముకిత్ భాయ్, అడే గణేశ్, సుద్దాల ఆనంద్, వామన్‌రావు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే'


ప్రజలకు అభివాదం చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పదేళ్ల పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి) గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో జోగు రామన్న పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలను ఏ విధంగా మోసం చేశాడో అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, దయాకర్, శ్రీనివాస్, మయూర్ చంద్రా, మహేందర్, దారట్ల జీవన్, ఉష్కం రఘుపతి, సత్యం, చిల్కూరి జ్యోతి రెడ్డి, రత్నాకర్ రెడ్డి, నాందేవ్, ఫరీద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

తాంసి: రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎలక్షన్ కమిషన్‌కి లేఖ రాసిన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. అంతకు ముందు నిపాని పెట్రోల్ బంక్ నుంచి మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, భీంపూర్, తాంసి జెడ్పీటీసీలు సుధాకర్, తాటిపెల్లి రాజు, ఎంపీపీ సంతోష్, నాగయ్య, లింబాజీ, షేక్ అఫ్రోజ్, నితిన్ పాల్గొన్నారు.

ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం స్థానిక డైట్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. సభలో పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మావల బైపాస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ తుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, సాజిదొద్దీన్, అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు


స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

తాంసి: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను ఎంపిక చేయడంతో మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. మండల కాంగ్రెస్ కార్యాలయ వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు కిష్టన్న, రాజ్‌బలి, చిన్నరాంరెడ్డి, వామన్, నవీన్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా వెడ్మ భొజ్జు పటేల్‌ను ప్రకటించడంతో ఖానాపూర్ నియోజకవర్గంలో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. దంతన్‌పల్లి, బీర్సాయిపేట, నర్సాపూర్, హస్నాపూర్ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు నిసార్, ఇమ్రాన్, మహేందర్, భరత్ పాల్గొన్నారు.

నేడు కుమురం భీం వర్ధంతి

బోథ్: సొనాలలో శనివారం నిర్వహించే కుమురం భీం వర్ధంతిని ఆదివాసీలు విజయవంతం చేయాలని పార్ది(బి) రాయిసెంటర్ నాయకులు కోరారు. ఆదివాసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామపటేళ్లు, దేవారి, మహజన్, యువకుల అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెస్రం భూమన్న, గంగాధర్, ఇస్రు, లాలురాం, శంభు, సీతారాం, మానిక్‌రావు, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి'


ఇచ్చోడ: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇచ్చోడ: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డిలు అన్నారు. శుక్రవారం తలమద్రి గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్క ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహరాజ్ అహ్మద్, గాడ్గే సుభాష్, పాండ్, దయకుమార్‌రెడ్డి, రాథోడ్ ప్రవీణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని బుర్కపల్లి, బంధం, వాంకిడి, కొర్టికల్(కె), ధన్నూర్(డి), అర్కగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పెంట వెంకట రమణ, మాజీ జెడ్పీటీసీ అంబేకర్ పండరి, ఓర్స రాజు యాదవ్, మందుల రమేశ్, మద్దెల నారాయణ, అరుణ్ గౌడ్, కరణ్ సింగ్ పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం నాయకులతో కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ కృష్ణ, రజనీకాంత్ రెడ్డి, భారత్, కల్యాణ్, మహేందర్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఆదరించండి


ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్: బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సోనాలలో సర్పంచ్ సదానందం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, గ్రంథాలయ డైరెక్టర్ రమణ గౌడ్, రవీందర్, భీమ బుచ్చన్న, సత్యనారాయణ, దేవిదాస్, నారాయణ పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో


ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: సీఎం కేసీఆర్ పేదలకు అండగా మేనిఫెస్టోను రూపొందించారని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రణదీవేనగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే జోగురామన్న గెలిపించాలని కోరారు. అర్హులైన వారికి రూ.5లక్షల జీవిత బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ. 3000 జీవన భృతి, రైతుబంధు, ఆసరా పెన్షన్ల పెంపు వంటి అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోవ రవి, పర్వీన్, నంద, గుజ్జు రాథోడ్, ఇబ్బు, నవీన్, జబ్బర్, సంజయ్, సునీల్, శ్రీధర్ పాల్గొన్నారు.

పత్తి రైతులు ఆందోళన


సుంకిడిలో స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తున్న రైతు

- వర్షాలు లేక ఎండుతున్న పంట
- దిగుబడిపై ప్రభావం

సిరికొండ: గత ఏడాది మంచి మద్దతు ధర పలికిందని ఈఏడాది కూడా రైతులు పత్తి పంటను అధికంగా సాగు చేశారు. వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు గత కొద్ది రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి ఆశాజనకంగా కనిపిస్తున్నా.. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఎండుముఖం పడుతోంది. దీంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికంగా ఎండలు..

చలికాలమే అయినా.. ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో పత్తి పంట నేలచూపులు చూస్తోంది. నీటి సదుపాయం ఉన్నవారు మాత్రం నీటి తడులు అందిస్తూ.. పంటను కాపాడుకుంటున్నారు. కేవలం వర్షాధారంపై ఆధాపడిన రైతులు పంట ఎండుతుందని దిగులు చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

పూత, కాత అంతంతే..

ప్రస్తుతం పూత, కాత కూడా అంతగా లేకపోవడంతో ఈ ఏడాది పత్తి ఒక్కసారి పత్తి ఏరడంతో పంట పూర్తవుతుందని రైతులు అంటున్నారు. కొందరు రైతులు ఇప్పటికే నీటి తడులు అందిస్తున్నారు. పంట రైతుల చేతికి రావాలంటే వర్షం కురిస్తేనే మేలని రైతులు భావిస్తున్నారు. పత్తి ఎండుతుండడం చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

150 పైపులు వేశాం



పత్తిని కాపాడుకోవడం కోసం అప్పు చేసి 150 పైపులు వేసి, వాగులో మోటార్లు పెట్టి నీటిని అందిస్తున్నాం. గత కొద్ది రోజులుగా వర్షం కురవకపోవడంతో పంటలను కాపాడుకోవడం ఇబ్బందిగా మారింది. ఈఏడాది పత్తి దిగుబడి తగ్గుతుంది.

– గర్షకుర్తి నారాయణ, రైతు, సిరికొండ

సాగునీటి వసతి లేదు

వర్షంపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాం. మాకు ఎలాంటి సాగునీటి వసతి లేదు. అక్టోబర్‌లో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈఏడాది పత్తి దిగుబడి అంతంతా మాత్రమే వస్తుంది. అప్పులు కూడా తీరేలా లేవు.

– సిడాం లక్ష్మణ్, రైతు, రిమ్మ

'కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి'


తలమడుగు: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జైనథ్: రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌ను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోరజ్ సమీపంలో జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. రైతులకు రైతుబంధు డబ్బులు నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ అడుగడుగునా.. అడ్డుపడుతుందన్నారు. కార్యక్రమంలో తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పన్ లింగారెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: రైతుబంధు నిలిపి వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకట రమణలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ నివాసంలో మాట్లాడారు. రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు అంబేకర్ పండరి, గాదె శంకర్, సాబ్లే నానక్‌సింగ్, ఏలేటి రవీందర్ రెడ్డి, సరసాని మహేందర్ రెడ్డి, జాదవ్ గణేష్, గులాబ్, కృష్ణ, ఏరు రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మావల మండల కేంద్రంలో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లా రాజేశ్వర్, ఏవన్, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, అజీమ్ ఖాన్, సుధీర్, అభిమాన్, సంతోష్, మోసిన్, సునీల్, గంగన్న పాల్గొన్నారు.

తలమడుగు: రైతుబంధు పథకాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఓడిపోతామని భయపడి రైతుబంధు పథకాన్ని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కేదారేశ్వర్ రెడ్డి, మొట్టె కిరణ్‌కుమార్, ఆశన్న యాదవ్, జీవన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభిరాంరెడ్డి, ప్రకాష్, దాస్, రవీందర్, నరసింహులు పాల్గొన్నారు.


జైనథ్: రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు


నేరడిగొండ: మాట్లాడుతున్న అల్లూరి శివారెడ్డి

బహిరంగ సభకు అనుమతి తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎలాంటి అనుమతి లేకుండా బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమైందని బీజేవైఎం నాయకులు ఆరోపించారు. సభకు అనుమతి ఇవ్వొద్దని శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు కిరణ్ కుమార్, పొన్నం జగన్ పటేల్, కురసెంగ పటేల్, మేకల మహేందర్ పాల్గొన్నారు.